వరిలో కలుపు కలవరం

- దిగుబడిపై ప్రభావం
- పెరుగుతున్న పెట్టుబడులతో రైతన్నల ఆందోళన



కాజులూరులో వరిని మించి పెరుగుతున్న కలుపు మొక్కలు

కాజులూరు: రబీలో కలుపు తీవ్రత రైతన్నలను కలవరపెడుతుంది. దీంతో సాగు కొనసాగించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. నియోజకవర్గ గ్రామాల్లోని వరి పొలాలు తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో ఉండటంతో ప్రస్తుతం సాగునీటి ఎద్దడి ఏర్పడింది. మెరక పొలాలకు నీరందక రైతులు కాలువల నుంచి వచ్చే కొద్దిపాటి నీటిని వంతుల వారీ విధానంతో పొలాలకు మళ్లించి సాగు చేస్తున్నారు. తరచూ సాగునీటి ఎద్దడి ఏర్పడటంతోనే వరిపొలాల్లో కలుపు తీవ్రత అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అధిక శాతం పొలాల్లో వెదచల్లిక విధానం అవలంభించడం కలుపు తీవ్రతకు మరో కారణమని రైతులు అంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండల గ్రామాల్లో సుమారు 52 వేల ఎకరాల్లో ఈ ఏడాది రబీలో రైతులు వరిసాగు చేపట్టారు. ఇందులో సుమారు 85 శాతం రైతులు వెదజల్లు విదానాన్ని అవలంభించారు. సాధారణ సాగులో రైతులు కొంత పొలంలో నారుపోసి, మొక్క ఎదిగిన తర్వాత నారుతీసి నాట్లు వేస్తుంటారు. ఈ విధానంలో కలుపు తీవ్రత తక్కువగా ఉంటుంది. అయితే వెదజల్లు విధానంలో పొలాన్ని దదును చేసి వరి విత్తనాలను నేరుగా పొలంలో చల్లుతుంటారు. ఈ విధానంలో వరి మొక్కతో పాటు కలుపు మొక్కలు సమాంతరంగా పెరుగుతుంటాయి. మార్కెట్‌లో వరి మొక్కకు నష్టం కలుగకుండా కలుపు మొక్కలను నిర్మూలించే కలుపు మందులు లభిస్తున్నప్పటికి అవి ఖరీదైనవి కావడంతో ఆర్థిక ఇబ్బందులు కారణంగా సన్న, చిన్నకారు రైతులు ఆ మందులను కొనుగోలు చేసి వినియోగించలేక కలుపు తీవ్రతను ఎదుర్కొంటున్నారు. నీటిఎద్దడి తలెత్తి పొలాల్లో ఆరుతడి తగ్గి చేను బురద పదునుకి చేరినప్పుడు కలుపు మొక్కలు విస్తృతంగా పెరుగుతుంటాయి. వరి పంటలకు వేసే ఎరువులను తీసుకుని వరి మొక్కలను అధిగమించి పెరుగుతుంటాయి. ప్రస్తుతం మండల గ్రామాల్లో వరి పంట దుబ్బుకట్టే దశ నుంచి ఈనిక దశలో ఉన్నాయి. పొలాల్లో కలుపు తీవ్రత ఇబ్బందికరంగా మారిందని ఈ పరిస్థితిలో కలుపు నివారణకు రసాయన మందులు పిచికారీ చేసిన ఫలితం ఉండదని తప్పనిసరిగా కూలీలతో కలుపు మొక్కలను తీయించాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క పంటలపై ఉధృతమవుతున్న తెగుళ్లతో పాటుగా, కలుపు నివారణకు మందులు వాడవలసి ఉండటంతో రబీలో ఖర్చులు అధికమయ్యే విధంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడులు పెరిగిపోతున్నాయి



ప్రస్తుతం రబీలో సాగునీటికి మొదటి నుంచి అధిక ఖర్చవుతుంది. దీనికి తోడు తెగుళ్ల దాడి చేయడంతో పాటుగా చేలల్లో కలుపు పెరగటం ఆందోళన కలిగిస్తుంది. వాటి నివారణకు మందులు వాడటం కారణంగా పెట్టుబడి పెరిగిపోతుంది.

– కాకి శ్రీనివాసరావు, రైతు, మతుకుమిల్లి

కలుపు నివారణలో జాగ్రత్తలు పాటించాలి



కలుపు నివారణకు మందులు పిచికారీ చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఎంపిక చేసిన మందులను మాత్రమే వినియోగించాలి. కలుపు రకాలను బట్టి వ్యవసాయాధికారుల సూచనల మేరకు పిచికారీ చేయాలి.

– వి.అశోక్, కాజులూరు మండల వ్యవసాయాధికారి

ఎంపీ గ్రాంట్స్‌తో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వెంకటాయపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సూర్యప్రకాశ్, నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎంపీ గ్రాంట్స్ నుంచి మంజూరు చేసిన రూ.15 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ చేతుల మీదుగా శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమాలు చేశారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ శ్మశాన వాటికకు సీసీ రోడ్డు, చిన్నంపేటలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఉప సర్పంచ్ గంధం బుజ్జి, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులతో కలసి సూర్యప్రకాశ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), మాజీ ఎంపీటీసీ దడాల రవికుమార్, నాయకులు దడాల వెంకటరమణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం



భాస్కరరావు, డిపో మేనేజర్, రామచంద్రపురం డిపో

కాజులూరు: మండల గ్రామాల్లో సోమవారం నుంచి పది పరీక్షలకు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు మండల విద్యాశాఖాధికారి డేవిడ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 594 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారన్నారు. ఇందులో కాజులూరు పరీక్ష కేంద్రంలో కాజులూరు జెడ్పీ పాఠశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 271 మంది, కుయ్యేరు పరీక్ష కేంద్రంలో కుయ్యేరు, కోలంక పాఠశాలలకు చెందిన 142 మంది, గొల్లపాలెం పరీక్ష కేంద్రంలో గొల్లపాలెం, మంజేరు, తణుకువాడ జెడ్పీ పాఠశాలలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 181 మంది, పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుందని విద్యార్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. నియమిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన లోనికి అనుమతించబడరన్నారు. విద్యార్థులకు సరిపడా బల్లలు, కుర్చీలు, తాగునీటి వసతులు అన్నీ కేంద్రాలలో సిద్ధం చేసి ఉంచామన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా పరీక్ష కేంద్రాల్లోని పరిసర గృహాల వారు సహకరించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ పికెటింగ్‌తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని లౌడ్ స్పీకర్లు పెట్టడం, శబ్దకాలుష్యం తలెత్తేలా శబ్దాలు చేయకూడదన్నారు.

పది విద్యార్థులకు ఉచిత ప్రయాణం

రామచంద్రపురం రూరల్: ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ చూపించి పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు సూచనల మేరకు ఏర్పాట్లు చేసినట్లు రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 17 నుంచి 31 వరకు ఇంటి నుంచి పరీక్ష కేంద్రాలకు, పరీక్ష కేంద్రాల నుంచి ఇంటికి ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు.

విలేకరుల పేరుతో దందా చేస్తున్న ఇద్దరిపై కేసు

మండపేట: తాము విలేకరులమని అడిగినంత ఇవ్వాలని ఓ డ్రైవరును బెదిరించిన ఘటనపై ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరం మండలం మహేంద్రవాడకు చెందిన చంద్రమళ్ల రవీంద్ర వ్యాన్‌లో కోడి పెంటను తీసుకుని మండపేట మీదుగా వెళుతుండగా గుమ్మిలేరు రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పెనుముచ్చి బాబూ సుకుమార్, పెంకే వంశీ కోడిపెంట వ్యాన్‌ను ఆపారు. తాము విలేకరులమని రికార్డు చూపించాలని డ్రైవరును అడిగారు. పోలీసులు అడిగితే చూపిస్తామని, చూపించడానికి మీరెవరని డ్రైవరు ప్రశ్నించారు. విలేకరులుగా తమకు ప్రశ్నించే హక్కుందని డ్రైవరును నిలదీశారు. వ్యాన్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లాలంటే తమకు 10 వేలు మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు డ్రైవరు అంగీకరించకపోవడంతో వ్యాన్‌ను స్టేషన్‌కు తీసుకురా అని స్టేషన్‌కు వద్దకు తీసుకువెళ్లారు. స్టేషన్ వచ్చిన తర్వాత సీఐ సురేష్‌కు డ్రైవరు జరిగిన వృత్తాంతం వివరించారు. దీంతో సీఐ ఆగ్రహం వ్యక్తం చేసి వ్యాన్ ఆపే అర్హత మీకెవరిచ్చారని ప్రశ్నించగా ఇరువురు వ్యక్తులు మిన్నకుండి పోయారు. దీనిపై డ్రైవరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. డ్రైవర్ రవీంద్ర ఫిర్యాదు మేరకు సుకుమార్, వంశీలపై సీఐ కేసు నమోదు చేశారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన అత్తిలి ఊదలయ్య అనే వ్యక్తిని 5 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో భాగంగా 5 లీటర్ల సారా కలిగి ఉన్న ఊదలయ్యను అదుపులోకి తీసుకుని, సారా స్వాధీనం చేసుకుని కొత్తపేట మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి



పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

- కమిషనర్ రంగారావు
- అధికారులతో సమీక్ష

మండపేట: పురపాలక సంఘాన్ని ఇటు సుందరంగాను, అటు ఆదాయాన్ని పెంచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. తాము చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు తమ వంతు సహకారం అందిస్తే లక్ష్య సాధనలో నూరు శాతం సఫలీకృతమవుతామని ఆయన అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అస్తి పన్ను వసూళ్లపై అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా ఆస్తిపన్ను వసూళ్లపై శ్రద్ధ వహించి మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం వసూళ్లు పూర్తి చేసి మున్సిపాలిటీని జిల్లాలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలన్నారు. ఇళ్లు, ఖాళీ స్థలం, కుళాయి పన్నులను ప్రజలు జాప్యం చేయకుండా త్వరగా కట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి వీధికి వస్తున్నారని వారికి సహకరించాలని కోరారు. పన్ను వసూళ్ల కోసం సిబ్బంది సెలవు దినాల్లో పనిచేస్తారని తెలిపారు. కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు కూడా సెలవు లేకుండా పనిచేస్తాయని గుర్తు చేశారు. అదే విధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించాలని కమిషనర్ సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో ఆర్వో జేవీఎస్ శాస్త్రి, డీఈ కే శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, బీ ఆంజనేయులు, ఆర్ఐలు ఏజేఎన్ శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాస్, మేనేజర్ హరిమోహన్, టీపీవో కే రమ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సచివాలయం, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రంగు పడింది



అంగరలో హోలీ పండగలో చిన్నారులు



కాజులూరులో రంగులు చల్లుకుంటూ హోలీ ఆడుతున్న చిన్నారులు

హ్యాపీ..హ్యాపీగా హోలీ సంబరాలు

రాయవరం: మనసులోని ప్రేమనంతా రంగులా గుమ్మరించే హోలీ వేడుకను శుక్రవారం మండలంలో సంబరంగా జరుపుకొన్నారు. సాధారణంగా పండగ రోజును కొత్త బట్టలు ధరించడం ఆనవాయితీ అయితే హోలీకి మాత్రం అందరూ పాత బట్టలు ధరించి జరుపుకొంటారు. చిన్నా పెద్దా అంతా ఒకరిపై ఒకరు రకరకాల రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. చిన్నారుల సందడికి హద్దే లేకుండా పోయింది.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: వికసించిన పూలు చిరునవ్వులు చిందించాయి. ఒక్కరికి ఒక్కరు తోడై చేయి చేయి కలిపారు. హోలీ రంగుల్లో తడిసి ముద్దయ్యారు. కులం, మతం, ప్రాంతం అనే బేధాలు కనుమరుగయ్యే రీతిలో రంగులు పూసుకుంటూ బేధాలెన్ని ఉన్నా ఐక్యతే ముద్దంటూ చాటి చెప్పారు. కపిలేశ్వరపురం మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, టేకి తదితర గ్రామాల్లోని చిన్నారులు హోలీ పండగను ఘనంగా జరుపుకొన్నారు. అంగరలోని శ్రీరామకృష్ణ పాఠశాలలోని చిన్నారులు వివిధ రంగులతో హోలీ చేసుకున్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో హోలీ పండుగ కార్యక్రమాలను శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా అంతా ఒక చోట చేరి హోలీ ఆడారు. పలు ప్రధాన కూడళ్లలో మహిళలు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.



వెదురుపాకలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

క్లుప్తంగా

పీఠంలో పూజలు



ప్రత్యేక పూజలందుకున్న విజయదుర్గా అమ్మవారు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం ఫాల్గుణ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుతగా విజయ వెంకటేశ్వరస్వామి వారికి సుప్రభాత సేవ, తులసిదళ అర్చన, భవానీ శంకర సమేత అష్టమలింగేశ్వరస్వామి వారికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. లలితా సహస్రనామాలు, అష్టోత్తరాలు, కుంకుమ పూజలు చేశారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ఫాల్గుణ పౌర్ణమి విశిష్టతను వివరించారు. విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఆర్వో బాబి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఉత్సాహంగా సిరిమానోత్సవం



ఉత్సవంలో భక్తులు, చిన్నారుల సందడి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసి ఉన్న గోగులమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సిరిమానోత్సవం ఆద్యంతం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు.

అంగరలో వాహనాల ఊరేగింపు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవతామూర్తుల వాహనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు పెద్దింటి వెంకటలక్ష్మి నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ భార్గవ్, సంపర లక్ష్మీ నరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించారు. శనివారం ఆలయంలో శ్రీపుష్పయాగం, 16న ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి రాంబాబు తెలిపారు.

చెత్త సేకరణపై అవగాహన

కపిలేశ్వరపురం: అంగరలో శుక్రవారం చెత్త సేకరణపై నివాసితులకు అవగాహన కల్పించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ అంగర కార్యక్రమంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్తను విభజించే పద్ధతి, పారిశుద్ధ్య కార్మికులకు అందజేసే పద్ధతిలను పంచాయతీ అధికారులు వివరించారు. గ్రామ వీధుల్లో చెత్తను తొలగించడాన్ని పర్యవేక్షించారు. కుళ్లిపోయే స్వభావం ఉన్న వ్యర్థాలను, కుళ్లని స్వభావం ఉన్న వ్యర్థాలను విభజించి ఎరువును తయారు చేయడం ద్వారా సంపదను సృష్టించవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, నివాసితులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి పరామర్శ

కపిలేశ్వరపురం: పితృ వియోగంతో బాధపడుతున్న కాలేరు ఎంపీటీసీ టేకి శ్రీసత్యమంజును ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు పరామర్శించారు. ఆమెను పరామర్శించిన వారిలో ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, పెందుర్తి శిరీష, మేడిశెట్టి దుర్గారావు, నాయకులు ఎం.దుర్గారావు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేసున్న నిత్యాన్నదాన పథకానికి అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామానికి చెందిన దంతులూరి సన్విత్ బంగారాజు, శరణ్య దంపతులు శుక్రవారం రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాత ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

వార్డు సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కపిలేశ్వరపురం: అనారోగ్యంతో మృతి చెందిన అంగర గ్రామ వార్డు సభ్యుడు శివుడు గంగాధరం కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ కార్యకర్తలు జనసేన సేవా ట్రస్ట్ ద్వారా రూ.1,01,000 ఆర్థిక సాయం అందించారు.

అంగర ఉన్నత పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్



భూమి పూజ చేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: అంగర ఉన్నత పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన శ్రీమతి బలుసు వసుంధర మెమోరియల్ ట్రస్టు ట్రాక్ నిర్మాణానికి ఆర్థిక వనరులను సమకూర్చనుంది. ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ బలుసు సుబ్బారావు పర్యవేక్షణలో పడమర ఖండ్రిక గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తిరునాతి వెంకటేశ్వరరావు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజాప్రతినిధులు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ దంపతుల అవార్డు స్వీకరణ



ఆదర్శ దంపతుల అవార్డును స్వీకరిస్తున్న గారపాటి దంపతులు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లకు చెందిన గారపాటి శ్రీనివాసు, పద్మజ దంపతులిద్దరూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన ఆదర్శ దంపతుల అవార్డు స్వీకరించారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ కళారంగ సంస్థ యువ ఆర్ట్స్ థియేటర్స్ ఏటా మాదిరిగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి వివిధ రంగాల్లో విశేష సేవలను అందించిన దంపతులను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. అందులో భాగంగా సేవా, సామాజిక రంగాల్లో విశేష సేవలందించిన గారపాటి దంపతులు స్త్రీశక్తి, సేవామూర్తి విభాగంలో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో గురువారం రాత్రి హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు తెలంగాణ తొలి శాసన సభాపతి ఎస్.మధుసూదనాచారి, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, హైకోర్టు న్యాయవాది ఎం.వెంకటేశ్వరి, ప్రముఖ గాయని మధుప్రియ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు వెన్నెల గద్దర్ తదితరులు చేతుల మీదుగా గారపాటి దంపతులు అవార్డులు స్వీకరించారు. ఆదర్శ దంపతుల అవార్డు పట్ల పలువురు నేతలు పార్టీలకతీతంగా అభినందనలు తెలియజేశారు.

దివ్యాంగ పిల్లలకు బాసటగా ‘భవిత’ కేంద్రాలు

ఆలమూరు: మానవ శరీరంలో అవయవాలు లోపించడంతో పాటు మానసికంగా నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయని ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఆలమూరులోని దివ్యాంగుల పాఠశాల (భవిత కేంద్రం)లో శుక్రవారం రావులపాలేనికి చెందిన పారా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు కేర్ గివెర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల కోఆర్డినేటర్ బడుగు మహిమారావు, ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ చిన్నారులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహిస్తూ వారి పనిని వారు చేసుకుంటూ వాళ్ల కాళ్ల మీద వారే నిలబడి కాలకృత్యాలు తీర్చుకునే శిక్షణను తెలియజేయాలన్నారు. అలాగే దివ్యాంగుల జీవితంలో మనోధైర్యాన్ని కలగజేస్తూ ముందుకు సాగే విధంగా ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా విభిన్న ప్రతిభావంతుల హక్కుల నేత బడుగు సుబ్బాయమ్మ పాల్గొని విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన హక్కులు, సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలైన దివ్యాంగ విద్యార్థులకు బహుమతుల పంపిణీ జరిగింది. ఐఈఆర్‌డీ ఉపాధ్యాయుడు విజయ్ కిరణ్, బ్లాక్ కోఆర్డినేటర్ జి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.